క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో పలువురు ప్రముఖులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతి, సన్నపురెడ్డి పెంచలరెడ్డి, తదితరులు మంత్రిని శాలువాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ట్రైసైకిళ్ల పంపిణీ



నెల్లూరు (పొగతోట): నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కోడూరుపాడుకు చెందిన దివ్యాంగులు చెన్నయ్య, రత్నానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గురువారం ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. జెడ్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి పాల్గొన్నారు.

పనుల పురోగతికి తోడ్పడాలి



పొదలకూరు : ఫీల్డ్ అసిస్టెంట్లకు మేట్లు సహకరించి గ్రామాల్లో పనుల పురోగతికి తోడ్పాటు నందించాలని డ్వామా ఏపీడీ శ్రీహరిరెడ్డి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మేట్లకు మూడ్రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఏపీడీ గురువారం పాల్గొని మాట్లాడారు. మేట్లు ప్రాథమికంగా కొలతలు, మస్టర్లు తీయడంపై అవగాహన పెంచుకోవాలన్నారు.. ఫీల్డ్ అసిస్టెంట్లు అన్ని రకాల పనుల వద్దకు హాజరు కాలేరని, మేట్ల సహకారం అవసరమవుతుందన్నారు. మేట్లు కూలీలను పనులకు తీసుకురావడంతో పాటు వారికి మస్టర్లు వేయడం, చేసిన పనుల కొలతలు తీయాలన్నారు. అనంతరం ఎంపీపీ కార్యాలయ ప్రాంగణంలో కొలతలు వేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్ కుమారి, ఏపీఓ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



ఇందుకూరుపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మండలంలోని కుడితిపాళెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు మత్స్యకార సొసైటీ సబ్సిడీపై టీవీఎస్ మోపెడ్‌లను మంజూరు చేసింది. వాటిని లబ్ధిదారులకు గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేష్, వెంకటరామిరెడ్డి, రవి, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి నగదు విరాళం

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన తుమ్మల శ్రీహరి,అనూరాధ దంపతులు గురువారం రూ.10 వేల నగదు విరాళం అందజేశారు. ఈ నగదును దేవస్థానం ప్రధానార్చకుడు దాతల నుంచి స్వీకరించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

దుత్తలూరు: నందిపాడులో అక్రమ మద్యం విక్రయాలపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఉమాశంకర్ తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

చేజర్ల: మండలంలో రెండుచోట్ల 'ఆడుదాం ఆంధ్రా' క్రికెట్ పోటీలు ఎంతో ఉత్సాహంగా సాగాయి. గురువారం మండలంలోని పాతపాడు, ఆదూరుపల్లి గ్రామాల్లో 5 మ్యాచ్‌లు జరిగాయి. పాతపాడులో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లను వీక్షించేందుకు సమీప గ్రామాల నుంచి అధిక సంఖ్యలో యువత విచ్చేశారు. కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మల్లికార్జున, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అవ్వాతాతల మనస్సులు గెలిచిన జగనన్న

• మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్



అల్లీపురంలో వృద్ధురాలికి పెంచిన పింఛన్ నగదు అందజేస్తున్న మేయర్ స్రవంతి

నెల్లూరు(బారకాసు): 'టీడీపీ హయాంలో అవ్వాతాతలు పింఛన్లు పొందేందుకు ఎన్ని కష్టాలు పడ్డారో స్వయంగా చూసిన జగనన్న నేను విన్నాను..నేను ఉన్నాను అంటూ అధికారంలోకి వచ్చాక పింఛన్ మొత్తాన్ని రూ.3 వేలకు పెంచుతామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు దశల వారీగా రూ.3 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారు. అవ్వాతాతలు మురిసేలా ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్ అందజేసి వారి మనస్సులు గెలుచుకున్నారు' అని నగర పాలక సంస్థ మేయర్ పొట్లూరి స్రవంతి జయవర్ధన్ అన్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక పెంపు సంబరాల్లో భాగంగా అల్లీపురంలో గురువారం నిర్వహించిన నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మేయర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని తెలిపారు. ఆయన నాయకత్వంలో పనిచేస్తున్నందుకు తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో కొందరు మీ ఇళ్ల వద్దకొచ్చి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై దుష్ప్రచారం చేస్తారని, వారి వలలో పడొద్దని సూచించారు.రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ రామ్మోహన్‌యాదవ్, పార్టీ శ్రేణులు శ్రీధర్‌రెడ్డి, మురళీరెడ్డి, బాలచంద్ర, బూత్ కన్వీనర్ విశ్వనాథ్, ఇమ్రాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా రాష్ట్రం

సామాజిక పింఛన్ల మంజూరులో దేశానికే మన రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని 21వ డివిజన్ కార్పొరేటర్ మొయిళ్ల గౌరి పేర్కొన్నారు. నగరంలోని 21వ డివిజన్ పరిధిలో కొత్త పింఛన్లను గురువారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ నగదును రూ.3 వేలకు పెంచి మాట నిలబెట్టుకున్నారని వివరించారు. జేసీఎస్ ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి, అంకోజీరావు, ప్రసాద్, సుహాసిని, వలంటీర్లు పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో...



20వ డివిజన్‌లో..

నెల్లూరురూరల్: 20వ డివిజన్‌లోని 20/1, 2 సచివాలయాల పరిధిలోని వనంతోపు, ఎరుకలపాళెం, దొమ్మరపాళెం, ఎర్రకోనేటిమిట్ట, అరుదంతీయపాళెం ప్రాంతాల్లో ఆ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెంచిన పింఛన్ నగదు రూ.3 వేలును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను వంద శాతం అమలు చేసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రధాన అనఘాష్టమి వ్రతం



అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్న అర్చకుడు



వత్ర పూజలు ఆచరిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని సుజాతమ్మకాలనీలోని శ్రీకృష్ణయోగ మందిరం ప్రాంగణంలోని అష్టలక్ష్మి మందిరంలో ప్రధాన అనఘాష్టమి వ్రతాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మార్గశిర బహుళ అష్టమిని పురస్కరించుకుని అవధూత దత్తపీఠం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా వ్రతాన్ని నిర్వహించారు. దత్తాత్రేయస్వామికి ఎంతో ప్రీతికరమైన ఈ వ్రతంలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా మైథిలి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. మందిర ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ సర్వేపల్లి అజయ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిర్దేశించిన మోతాదులోనే ఎరువులు వాడాలి



వరినాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నెల్లూరురూరల్: నిర్దేశిత మోతాదులోనే వరి పంటకు రసాయన ఎరువులు వాడాలని నెల్లూరు ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ నాగమోహన్ రైతులకు సూచించారు. రూరల్ మండలం కలివెలపాళెం, పెనుబర్తి గ్రామాల్లో గురువారం వారు పర్యటించారు. వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. పరిమితికి మించి రసాయన ఎరువులు వాడడం వల్ల పంటకు తెగుళ్లు సోకి నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అధికంగా యూరియా వాడకంతో తలెత్తే అనర్థాలను వివరించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి



సజ్జలను కలిసిన ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు (టౌన్): తాడేపల్లిలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీ చంద్రశేఖరరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమగ్రశిక్షలో పనిచేస్తున్న సీఆర్టీ, ఏఈఆర్టీ, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల జీతాల పెంపు, జూనియర్ కళాశాలల అధ్యాపకుల పదోన్నతులు, గురుకులాల్లో పనిచేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాల పెంపు, గిరిజన సంక్షేమ గురుకులాల టీచర్ల వేతనాల పెంపు, ఉపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీల సమస్యలను సజ్జల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్సీ తెలిపారు. అనంతరం ఆయన పాఠశాల విద్యా కమిషనర్ సురేష్‌కుమార్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను విన్నవించారు.

ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు



నెల్లూరురూరల్: ముస్లిం మైనార్టీల ద్రోహి చంద్రబాబు నాయుడని, ఆయనకు వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు తగిన విధంగా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ నిజాముద్దీన్ అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 29వ డివిజన్ గాంధీ నగర్‌లో గురువారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్‌సీపీ పాలనలో ముస్లిం మైనార్టీలకు అధిక ప్రాధాన్యం కల్పించడం జరిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీలకు అధికంగా సీట్లు కేటాయించే దిశగా చర్యలు తీసుకోవడం ఎంతో గర్వించదగిన విషయమని కొనియాడారు. అనంతరం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక కార్పొరేటర్ సత్తార్, నాయకులు సాయిరెడ్డి, జాహిద్, అంజాద్, జాకీర్, ఖలీల్, అస్లాం, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీలో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (పొగతోట): జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను గురువారం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ కేక్ కట్ చేసి జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సీఈఓ భూపతి చిరంజీవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీకి వినతి

నెల్లూరు (దర్గామిట్ట): మండల కమిటీ ఆమోదంతో తన కార్యాలయంలో ఏర్పాటు చేసుకున్న దివంగత చెన్ను బాలకృష్ణారెడ్డి చిత్రపటాన్ని అధికారులు తనకు తెలియకుండానే తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని జేసీ రోణంకి కూర్మనాథ్‌కు రాపూరు ఎంపీపీ ప్రసన్న గురువారం వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ అయిన తనకు ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదన్నారు. మండలంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల సమాచారం ఇవ్వకుండా అవమానిస్తున్నారని విన్నవించారు.

ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు (పొగతోట) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఇందుకూరుపేట తాలూకా యూనిట్ టేబుల్ క్యాలెండర్–2024ను జిల్లా పంచాయతీ కార్యాలయంలో డీపీఓ సుస్మితారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై రమణారెడ్డి, వై మల్లికార్జున మాట్లాడుతూ తొలిసారిగా తాలూకా స్థాయిలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ముద్రించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట తాలూకా యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం నారాయణరెడ్డి, జీ రాంబాబు, జిల్లా కోశాధికారి పీవీఎస్ టీ రాంప్రసాద్, తాలూకా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, పద్మజ, అజీజ్, సుబ్బయ్య, హరిప్రసాద్, సురేంద్రనాథ్, రమ, ఖాజాబీ, రమేష్ బాబు, మస్తాన్‌బాబు, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



మాట్లాడుతున్న కమలాకర్‌రెడ్డి

నెల్లూరురూరల్: రూరల్ మండలం కోడూరుపాడులో గ్రామదేవత ఊళ్లమ్మ తల్లి కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా ఈ నెల 6న ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి తెలిపారు. కోడూరుపాడు సొసైటీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. సుమారు 30 జతల ఎడ్లు బండలాగుడు పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. పోటీల్లో రాణించిన ఎడ్లకు మాజీ కార్పొరేటర్ లేబూరు పరమేశ్వరరెడ్డి ప్రథమ బహుమతి రూ.50 వేలు, కోడూరు రాజేష్‌రెడ్డి ద్వితీయ బహుమతి, కార్పొరేటర్ జానా నాగరాజు తృతీయ బహుమతి రూ.30 వేలు, ముచ్చకాయల వేణు నాల్గో బహుమతి రూ.25 వేలు, రామిరెడ్డి రమేష్‌రెడ్డి ఐదో బహుమతి రూ.20 వేలు, తమ్మి శ్రీనివాసులు ఆరో బహుమతి రూ.15 వేలు, మౌలాలి ఏడో బహుమతి రూ.10 వేలు విజేతలకు అందజేయనున్నట్లు వివరించారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



నెల్లూరు(క్రైమ్): ఎస్పీ కే తిరుమలేశ్వరరెడ్డిని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు వివిధ అంశాలపై చర్చించారు.

7న మోపూరు చిత్రపటం ఆవిష్కరణ

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతి సమాజంలో ఈ నెల 7న ప్రముఖ సాహితీవేత్త, ఆధ్యాత్మిక ప్రవచనకర్త మోపూరు వేణుగోపాలయ్య చిత్రపటాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య గురువారం తెలిపారు. ఉదయం 10గంటలకు చిత్రపటాన్ని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన, సుమతి శతక పద్యాల కంఠస్థ పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే సాహితీవేత్తలను సత్కరించనున్నట్లు తెలిపారు.

నేడు బీసీ రాజ్యాధికార సభ

నెల్లూరు (వేదాయపాళెం): నగరంలోని పురమందిరంలో శుక్రవారం బీసీ రాజ్యాధికార సభ నిర్వహించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సమాధి శ్రీనివాసులుయాదవ్ తెలిపారు. స్టోన్‌హౌస్‌పేటలోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రాజ్యాధికారం కోసం బీసీ సంఘం ఆధ్వర్యంలో చైతన్య రథయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి చేపడుతున్న రథయాత్ర నెల్లూరుకు చేరుకుంటున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభకు ఎంపీ బీద మస్తాన్‌రావు, ముఖ్యఅతిథులుగా సంఘ రాష్ట్రాధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్, జాతీయ కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, మహిళా అధ్యక్షురాలు నూకానమ్మ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని బీసీ కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బుధవరపు బాలాజీ, నీళ్ల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో గోవిందరాజు సీతాదేవి సాహితీవేదిక, హిందీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ గిరి పూలమాల వేసి నివాళుర్పించారు. బ్రెయిలీ అంధుల కోసం లిపిని కనుగొని వారి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అనంతరం హిందీ డిపార్ట్‌మెంట్ హెడ్ సురేంద్రను శాలువాతో సత్కరించారు. కవి పెంచల నరసింహ, సాహితీ వేదిక అధ్యక్షురాలు సుభద్రాదేవి, అధ్యాపకురాలు దివ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న నరసింగరావు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రొబేషన్ డిక్లరేషన్ ఉత్తర్వులను విడుదల చేసి గ్రేడ్–2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు కోరారు. నగరంలోని జెట్టిశేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో రాష్ట్ర స్థాయి ఎనర్జీ అసిస్టెంట్ల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి నరసింగరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డిస్కంలలో విధులు నిర్వహిస్తున్న వారికి అందిస్తున్న విధంగా బేసిక్ అలవెన్స్‌లతో పాటు ఇతర అలవెన్సులను ఎనర్జీ అసిస్టెంట్లకు అందజేయాలని, విధుల్లో మృతి చెందిన ఎనర్జీ అసిస్టెంట్ల కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. 2019లో విధుల్లో చేరిన వారికి 2022 పీఆర్సీని అమలు చేయాలని, విద్యుత్ సంస్థ నుంచి నేరుగా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు సూరిబాబు, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జేఎల్ఎం గ్రేడ్–2 రాష్ట్ర కన్వీనర్ పెంచలప్రసాద్, జిల్లా నాయకులు రసూల్, సునీల్, ప్రసన్నకుమార్, ప్రదీప్, నారాయణ, మస్తాన్, నవీన్ పాల్గొన్నారు.

8న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో రెండు దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతూ ఈ నెల 8న తలపెట్టిన ఒక్కరోజు ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సూరిబాబు పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాయంలో ధర్నాకు సంబంధించిన పోస్టర్లను గురువారం వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నా చేపడుతున్నామని తెలిపారు. మీటర్‌రీడర్లకు ఉద్యోగభద్రత కల్పించాలని, అర్హులైన కార్మికులను షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి మహేష్, నగర ప్రధాన కార్యదర్శి ఆరీఫ్,నాయకులు శ్రీనివాసులు, రామారావు, శరత్, తదితరులు పాల్గొన్నారు.